సేంద్రియమే మేలు

- రసాయనిక ఎరువులతో పంటలకు నష్టం
- కోల్పోతున్న భూసారం
- అధిక ఎరువుతో అనర్థాలే



లోకేశ్వరంలో నానో ఎరువులపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో గిరిరాజ్

జిల్లాలో సాగు వివరాలు

పంటలు	ఎకరాలు
వరి	1.40 లక్షలు
పత్తి	1.57 లక్షలు
సోయా	1.05 లక్షలు
మొక్కజొన్న	40 వేలు

లోకేశ్వరం: పంటల సాగులో రైతులు రసాయన ఎరువులను అధికంగా వాడుతున్నారు. దిగుబడి పెరుగుతాయని ఎరువుల మోతాదు పెంచడంతో భూమి సహజ లక్షణాలు కోల్పోయి నిస్సారమవుతోంది. ఇది ఇలాగే కొనసాగితే భూములు సేద్యానికి పనికిరాకుండా పోతాయని వ్యవసాయ నిపుణులు పేర్కొంటున్నారు. రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని దశలవారీగా తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం సంస్కరణలకు శ్రీకారం చుడుతోంది. ఇందులో భాగంగా గుళిక రూపంలో ఉండే యూరియా, డీఏపీలకు బదులుగా నానో లిక్విడ్ రూపంలో అందుబాటులోకి తీసుకువచ్చింది. వీటి వాడకంతో సారవంతమైన భూములు స్వభావం దెబ్బతినకుండా ఉండడంతోపాటు వాతావరణ కాలుష్యం తగ్గుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సేంద్రియ ఎరువుల వాడకం మేలని సూచిస్తున్నారు.

క్షీణిస్తున్న భూసారం

రసాయనిక ఎరువులు విచ్చలవిడిగా వాడటం ద్వారా పంట భూములు నిస్సారమవుతున్నాయి. యూరియా బస్తాల్లో 46 శాతమే యూరియా, 54 శాతం సున్నపు గుళికలాంటి మూల పదార్థాలు ఉంటాయి. ఈ గుళికలపై సున్నపు పూత పూస్తారు. దీన్ని నేలపై వేయడంతో మూలపదార్థాలు పేరుకుపోయి, భూసారం తగ్గుతుంది. నేలపై ఉండే సహజ బ్యాక్టీరియా, రైతు నేస్తాలు నశించిపోతున్నాయి. ఫలితంగా రైతులకు దిగుబడి తగ్గుతున్నాయి. కాగా, జిల్లాలో రైతులు 1.85 లక్షల మంది రైతులు ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా వానాకాలం సీజన్‌లో వివిధ రకాల పంటలు పండించారు. పంటల దిగుబడి కోసం ఎకరాకు 150 కిలోల డీఏపీ, 100 కిలోల యూరియా వినియోగిస్తున్నారు. పూత దశకు వచ్చాక పత్తికి ఐదుసార్లు పురుగుమందులు పిచికారీ చేస్తున్నారు.

యూరియా కోసం బారులు

అధిక యూరియా వినియోగించొద్దని జిల్లాలోని తానూరు, ముధోల్, లోకేశ్వరం మండలాల్లో రైతులకు అవగాహన కల్పించిన తీరు మారడం లేదని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. సరిపడా యూరియా పంపిణీ చేసిన కూడా అధికంగా కొనుగోలు చేస్తున్నారని చెబుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



భూముల సారం కోల్పోకుండా ఉండేందుకు రైతులు సేంద్రియ ఎరువులు వాడాలి. భూమిలో పోషక విలువలు పెరిగి గుల్లగా మారుతుంది. నీటిని పీల్చుకునేతత్వం వృద్ధి చెందుతుంది. మొక్కలకు నీటితోపాటు కావాల్సిన పోషకాలు సమృద్ధిగా అందుతాయి. రైతులకు నానో యూరియా, సేంద్రియ ఎరువులపై అవగాహన కల్పిస్తున్నాం. – అంజిప్రసాద్, డీఏవో

క్లుప్తంగా

గోవులను సంరక్షించాలి



పుస్తకాలు అందజేస్తున్న నారాయణ

కుంటాల: గోవులు రక్షించడం మన బాధ్యత అని జిల్లా గో సేవాప్రముఖ్ కొత్తకాపు నారాయణ అన్నారు. గో విజ్ఞాన పరీక్షల నిర్వహణ కోసం స్థానిక ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు సోమవారం 550 పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి సహాయపడే ఉత్పత్తులు గోవుల ద్వారా మనకు అందుతున్నాయని తెలిపారు. ఆవు పేడ, గోమూత్రం ఉపయోగించి తయారు చేసిన సేంద్రియ ఎరువులు, ఆయుర్వేద ఉత్పత్తులు తమకు ఎంతో దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ ఎత్రాజ్ రాజు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘంలో ఆడిట్



రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు

కుంటాల: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికిగాను అధికారులు సోమవారం ఆడిట్ నిర్వహించారు. రుణాల మంజూరు, వసూళ్లు, విత్తనాలు, ఎరువుల విక్రయాలు, వరి, సోయా, జొన్న కొనుగోళ్లకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఆడిటర్ భూమన్న, జూనియర్ ఆడిటర్ మహ్మద్ తోఫిక్ హుస్సేన్, సీఈవో నాగభూషణం తదితరులు ఉన్నారు.

టీజీబీ మేనేజర్‌గా రమణారెడ్డి



రమణారెడ్డి

కుంటాల: కుంటాల టీజీబీ మేనేజర్‌గా రమణారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సుధీర్ హైదరాబాద్ ప్రధాన కార్యాలయానికి బదిలీ కాగా, రమణారెడ్డి ఆదిలాబాద్ జిల్లా పెండల్‌వాడి నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. సిబ్బంది ఆయన్ను సన్మానించారు.

సెకండ్ ఏఎన్‌ఎంల పనిభారం తగ్గించాలి



నిరసన తెలుపుతున్న ఏఎన్‌ఎంలు

పెంబి: సెకండ్ ఏఎన్‌ఎంలకు అదనపు పనిభారం తగ్గించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు గంగామణి అన్నారు. సోమవారం ఏఎన్‌ఎంలతో కలిసి పెంబి పీహెచ్‌సీ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024 డిసెంబర్ 29న రెగ్యులర్ ఏఎన్‌ఎంలుగా ప్రమోట్ చేసేందుకు ప్రభుత్వం రాత పరీక్ష నిర్వహించింది. ఇప్పటికీ ఫలితం విడుదల చేయలేదన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌తోపాటు ఉద్యోగ భద్రత హామీ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఎన్‌ఎంలు ఇంద్ర, స్వాతి, సారిక, కమల, పార్వతి, పద్మ, లావణ్య, గౌతమి, రజిత, చంద్రకళ తదితరులు ఉన్నారు.

సారంగపూర్: సెకండ్ ఏఎన్‌ఎంల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ సోమవారం పీహెచ్‌సీ ఎదుట ఆందోళన చేపట్టారు. మణికుమారి, సునీత, నుస్రత్, ఉమ తదితరులు ఉన్నారు.

మురుగుకాల్వ శుభ్రం



శుభ్రం చేస్తున్న కార్మికులు

సాక్షి ఎఫెక్ట్

కుభీర్: మండలంలోని పార్డి(బి) గ్రామంలో మురుగుకాల్వలో చెత్తాచెదారం నిండి నీరు రోడ్డుపై పారుతోంది. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. 'మురుగు కష్టాలు' శీర్షికన సోమవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. సిబ్బందితో మురుగుకాల్వను శుభ్రం చేశారు. కార్యదర్శి భూమేశ్ ఉన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

నిర్మల్‌టౌన్: ఉద్యోగ ఉపాధ్యాయులకు సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.భూమన్న యాదవ్ పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని పలు పాఠశాలల్లో సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 317 జీవో బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న పెన్షనర్స్, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రమోషన్ల ద్వారా ఖాళీ అయిన ప్రాథమిక పాఠశాలలో సంఖ్యకు అనుగుణంగా విద్యావలంటీర్లు నియమించాలన్నారు. ఎస్టీయూ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు రసీదు అందిస్తున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు భూమన్న యాదవ్

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

లక్ష్మణచాంద/మామడ/సోన్/ఖానాపూర్: : మండలాల్లో ఉత్తమ ఉపాధ్యాయులను సోమవారం సన్మానించారు. లక్ష్మణచాంద మండల విద్యావనరుల కేంద్రంలో రాథోడ్ దిలీప్, గంగాధర్, తేజ, శ్రీదేవి, వినయ్, రాజశ్రీ, మంజుల, అర్చన, శివరాణి, శ్రీపాద్, వినోద్‌కుమార్, భూషణ్, శారద, రాందాస్, సుమన్, శ్రీనివాస్, ప్రమోద్, నారాయణ, భాగ్యలక్ష్మికి ఎంఈవో అశోక్ వర్మ పూలమాలలు వేసి సత్కరించారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం రాజునాయక్, ఉపాధ్యాయ సంఘం నాయకులు సాయిప్రసాద్, సీహెచ్ మోహన్, దాసరి శంకర్, అశోక్, ఆచార్య, సీఆర్పీలు మహేందర్, సుధాకర్ పాల్గొన్నారు.

- మామడ మండల పరిషత్ సమావేశంలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఎంపీడీవో సుశీల్‌రెడ్డి, ఎంఈవో వెంకటరమణరెడ్డి, పీజీ హెచ్‌ఎం అరవింద్‌కుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.
- సోన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన కాల్వగడ్డ ఆరాధన, మారెడ్డి శ్రీనివాస్, వెంకన్న, అనుముల కమలాకర్ రావు, ఆరోళ్ల చంద్రశేఖర్‌రావు, సంజయ్, రాపర్తి అశోక్‌కుమార్, తాటికొండ రాజేశ్వర్, హేమలత, స్వరూపను సన్మానించి అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో తొడిశెట్టి పరమేశ్వర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులే జాతి నిర్మాతలని అన్నారు. రిటైర్డ్ హెచ్‌ఎం వకుళాభరణం కృష్ణమూర్తి, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రమేశ్‌బాబు, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, హెచ్‌ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.
- ఇటీవల ఐటీడీఏ పీవో కుష్బుగుప్తా చేతుల మీదుగా ఐటీడీఏ పరిధిలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న అజ్మీరా ఈశ్వర్ సేవలు ప్రశంసనీయమని ప్రభుత్వ బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం ఎంఏ గఫార్ అన్నారు. ఖానాపూర్‌లోని ఆశ్రమ పాఠశాల బృందం ఆధ్వర్యంలో అవార్డు గ్రహీత శంకర్‌ను సోమవారం సన్మాంచారు.



లక్ష్మణచాంద: సన్మానం పొందిన ఉత్తమ ఉపాధ్యాయులతో ఎంఈవో అశోక్ వర్మ

సంక్షిప్తంగా

వినాయక సెలవికా..

కుంటాల: మండల కేంద్రంలో సోమవారం వినాయక నిమజ్జనోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. అందంగా అలంకరించిన ప్రత్యేక వాహనాల్లో గణపయ్యలను ఉంచి మేళ తాళాలతో, యువకులు నృత్యాలు చేస్తూ శోభాయాత్ర నిర్వహించారు. ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు

ముధోల్: కేజీబీవీలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ శివకుమార్ వారికి రక్త పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఏఎన్ఎస్ మంజుల, ప్రిన్సిపాల్ ఫాతిమా బేగాం, ఉన్నారు.

సన్మానం

కుభీర్: మండలంలోని వివిధ గ్రామాల్లో గణేశ్ నిమజ్జనాలు శాంతియుతంగా నిర్వహించిన ఎస్సై క్రిష్టారెడ్డి, ఏర్పాట్లు చేసిన ఎంపీడీవో సాగర్‌రెడ్డి, కుభీర్ ఈవో విజయ్‌కు కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. ఆత్మ చైర్మన్ వివేక్, మండల అధ్యక్షుడు బషీర్, నాయకులు బంక బాబు, పి.రవికుమార్, సందీప్, సాయిరెడ్డి, జెడిరాం తదితరులు ఉన్నారు.

నర్సాపూర్(జి): నర్సాపూర్(జి) బ్రాంచి టీజీబీ మేనేజర్ సతీశ్‌కుమార్ బదిలీ అయ్యారు. ఆయన చేసిన సేవలకుగాను సోమవారం రైతులు సన్మానించారు. బ్యాంక్ సిబ్బంది ఉన్నారు.

మతసామరస్యం చాటిన ముస్లిం యువకుడు

కుంటాల: మండల కేంద్రంలోని బజరంగ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయకుని వద్ద కుంటాలకు చెందిన చికెన్ వ్యాపారి ఎస్‌కే. యూసుఫ్ సోమవారం అన్నదానం చేసి మతసామరస్యం చాటాడు. ఈ సందర్భంగా ఆయన్ను యువకులు సన్మానించి అభినందించారు.

శుద్ధిజల యంత్రం అందజేత

కుభీర్: మండలంలోని నిగ్వా ఉన్నత పాఠశాలకు గ్రామీణ సపోర్ట్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో రూ.30 వేల విలువ గల శుద్ధి జలయంత్రాన్ని అందజేశారు. సొనారి ప్రాథమిక పాఠశాలకు రూ.15 వేల విలువ గల ఎల్‌ఈడీ టీవీని అందించారు. వ్యవస్థాపకులు కదారి నరేశ్, ఎంఈవో విజయ్‌కుమార్, నిగ్వా మాజీ సర్పంచ్ రాజు, మాజీ ఎంపీటీసీ దేవిదాస్, సంస్థ ప్రతినిధులు రాజేశ్వర్, రోహిత్, దత్తాత్రి, సాయికృష్ణ, హెచ్‌ఎంలు ఉన్నారు.

ఫైలేరియా వ్యాధిపై అవగాహన

సోన్: మాదాపూర్‌లో పల్లె దవాఖానా వద్ద లెప్రా ఇండియా సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం ఫైలేరియా వ్యాధిపై అవగాహన కల్పించారు. హెల్త్ అసిస్టెంట్లు పురుషోత్తం, కిషన్‌రావు పాల్గొన్నారు.

పంట నష్ట పరిహారం అందించాలి

బాసర: భారీ వర్షాలు, వరదలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారాన్ని కౌలు రైతులకే అందించాలని భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) నాయకులు కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ ర్యాలీ

నిర్మల్‌టౌన్: మహమ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకొని మిలాద్ ఉన్ నబీ ర్యాలీని జిల్లా కేంద్రంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. మిలాద్ కమిటీ కార్య నిర్వాహక అధ్యక్షుడు ఇసాక్ అలీ, మనజిర్ బుఖరీ, సయ్యద్ అన్వార్ పాషా, మూర్తుజా అలీ, గౌస్, మిస్బ, అజాం, లియఖత్ అలీ, అయ్యుబ్, ఫహీం, ఇంతియాజ్ అలీ, సోఫి ఇమ్రాన్ పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై అభ్యంతరాలుంటే తెలపాలి

లోకేశ్వరం/ఖానాపూర్/తానూరు/కడెం/కుంటాల/సారంగపూర్/ముధోల్: ఖానాపూర్, లోకేశ్వరం, తానూరు, కడెం, కుంటాల, సారంగపూర్, ముధోల్‌లో ఓటరు జాబితాపై రాజకీయ పార్టీల నాయకులతో అధికారులు సోమవారం సమావేశం నిర్వహించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో జాబితాలపై ఏవైన అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు. తప్పొప్పులు ఉన్నట్లయితే సరి చేస్తామన్నారు. ఎంపీడీవోలు సోలమాన్‌రాజ్, రత్నాకర్‌రావు, నసిరొద్దీన్, అరుణ, అల్లాడి వనజ, లక్ష్మీకాంత్‌రావు, శివకుమార్, ఎంపీవో కవిరాజు, పీఏసీఎస్ చైర్మన్ రత్నకర్‌రావు, రాజకీయ పార్టీల నాయకులు సుదర్శన్‌రెడ్డి, పుప్పాల ఉపేందర్, వర్మ, షఫి, షాకిర్, రాజశేఖర్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు జీవన్, పడకంటి దత్తాద్రి, ఎం.ప్రదీప్ కుమార్, బోగ గోవర్ధన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మహిళ మృతి

భైంసాటౌన్: పట్టణానికి చెందిన బచ్చువార్ సంగీత (40) గుండెపోటుతో మృతిచెందారు. వివరాలిలా ఉన్నాయి.. పట్టణానికి చెందిన 25 మంది బృందంతో కలిసి ఇటీవల నేపాల్‌కు విహారయాత్రగా వెళ్లారు. తిరిగివస్తున్న క్రమంలో బీహార్‌లోని పాట్నాకు చేరుకోగా, సోమవారం ఉదయం సంగీతకు గుండెపోటు వచ్చింది. దీంతో వెంటనే అక్కడి ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో వారి కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆమె మృతదేహాన్ని భైంసాకు రప్పిస్తున్నారు.

స్తంభాన్ని సరిచేశారు..

నర్సాపూర్(జి): మండలంలోని బూరుగుపల్లి(జి) తండా శివారులోని ఓ రైతు వ్యవసాయ క్షేత్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు 11 కేవీ విద్యుత్ స్తంభం నేలకొరిగింది. కర్రల సాయంతో స్తంభాన్ని నిలబెట్టి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూశారు. సోమవారం విద్యుత్ సిబ్బంది స్తంభాన్ని సరిచేసినట్లు ఏఈ మధు తెలిపారు.

కబ్జాదారుడిపై చర్యలు తీసుకోవాలి

కడెం: తన సాగు భూమిలో ఇంటి నిర్మాణం చేపడుతున్న కబ్జాదారుడిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని పెత్తర్పు గ్రామానికి చెందిన జాడి రాజన్న కోరాడు. మండలంలోని నచ్చన్ఎల్లాపూర్ శివారులోని తండా వద్ద ఉన్న తన భూమిలో అజ్మీరా శేఖర్ అక్రమ ఇంటి నిర్మాణం చేపడుతున్నాడని ఈ విషయమై తనకు న్యాయం చేయాలని తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్సైకి సోమవారం ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నాడు.

ప్రభుత్వ బడులు ప్రోత్సహించాలి

నిర్మల్‌టౌన్: ప్రైవేట్ విద్యాసంస్థలను మూసివేయాలని, ప్రభుత్వ బడులు ప్రోత్సహించాలని రాజ్యాంగ పరిరక్షణ వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ నూనెల శ్రీనివాస్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వ బడులు బాగుపడాలన్న, సంపూర్ణ అక్షరాస్యత సాధించాలన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, సర్పంచులు, కౌన్సిలర్లు, అధికారులు, టీచర్లు తమ పిల్లలను ప్రభుత్వ స్కూళ్లలోనే చదివించాలని కోరారు. అలా చేయని ప్రజాప్రతినిధులను అనర్హులుగా ప్రకటించాలని, ఉద్యోగులను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

లోకేశ్వరం: మండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని నగర్, కిష్టాపూర్, లోకేశ్వరం, మల్కాపూర్, లోకేశ్వరం టౌన్, రాయాపూర్ కాండ్లీ గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ శివకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటలకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. సబ్‌స్టేషన్‌లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ అమర్చడం వల్ల సరఫరా ఉండదని, ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.

'ఇందిరమ్మ' పనులు వేగవంతం చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

కుంటాల: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్, అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ) కిశోర్‌కుమార్ సూచించారు. కుంటాల మండల అధికారులతో సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ కమల్‌సింగ్, ఎంపీడీవో అల్లాడి వనజ, ఎంపీవో ఎంఏ.రహీంఖాన్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ విజయలక్ష్మి, హెచ్‌డబ్ల్యూవో నగేష్, సీసీ ముత్యం తదితరులు పాల్గొన్నారు.

మోక్ష గణపతి హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

లోకేశ్వరం: మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామంలోని మోక్ష కర్ర గణపతి హుండీని మోక్ష గణపతి కమిటీ సభ్యులు సోమవారం లెక్కించారు. 11 రోజుల్లో రూ.2,75,010 నగదు, కిలో వెండి భక్తులు సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

నేటి నుంచి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

నిర్మల్‌రూరల్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం నుంచి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించాలని డీఈవో భోజన్న ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 50 శాతం ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు, 10న మిగతా 50 శాతం మంది ఉపాధ్యాయులకు ప్రాథమిక స్థాయి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ఉంటాయని తెలిపారు. ఉన్నత పాఠశాలలో లాంగ్వేజ్ వ్యాయామ విద్య ఉపాధ్యాయులకు 11న ఉన్నత స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించాలని పేర్కొన్నారు. 12న గణితం, భౌతిక, జీవ, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులకు ఉన్నత స్థాయి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించాలని హెచ్‌ఎంలకు సూచించారు.

నేడు పుస్తకావిష్కరణ

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో వరగంటి పండరి విప్లవ ప్రస్థానానికి సంబంధించి ×ఆరని వెలుగు–సూర్యం×అనే పుస్తకాన్ని మంగళవారం ఆవిష్కరించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11:30 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ కోదండరాం, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, మాజీ ఎంపీ సోయం బాపూరావు హాజరవుతారని తెలిపారు.



మధ్యాహ్నం 12.10 గంటలకు ఖాళీగా కనిపిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్ల చైర్లు

సమయపాలన ఏది?

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి అధికారులు సమయపాలన పాటించలేదు. ఉదయం10:30 గంటలకు ప్రజావాణి ప్రారంభం కావల్సి ఉండగా జిల్లా స్థాయి అధికారులే రెండు గంటలు ఆలస్యంగా రావడంతో అర్జీదారులు వేచి చూడాల్సిన పరిస్థితి. వారు వచ్చే వరకు పడిగాపులు కాశారు. ముధోల్ తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణికి తహసీల్దార్, ఎంపీడీవో హాజరయ్యారు. వివిధ శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. అధికారులు రాకపోతే తమ సమస్యలను ఎవరు తీరుస్తారని మండల వాసులు వాపోయారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్/ముధోల్



పడిగాపులు కాస్తున్న అర్జీదారులు

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి



బహుమతులు అందజేస్తున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్‌రూరల్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని జుమ్మెరాత్ పేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 1 నుంచి వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులతోపాటు నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. సంపూర్ణ అక్షరాస్యత సాధించేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. అనంతరం వారోత్సవ కార్యక్రమాల్లో నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. డీఈవో డి.భోజన్న, డీఆర్డీవో విజయలక్ష్మి, మెప్మా పీడీ సుభాష్, ఎంఈవో నాగేశ్వర్ రావు, విద్యాశాఖ అధికారులు పరమేశ్వర్, ప్రవీణ్, పాఠశాల హెచ్‌ఎం రవిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సారంగపూర్: చించోలి(బి) ఉన్నత పాఠశాలలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఖానాపూర్/సారంగపూర్/లోకేశ్వరం/నర్సాపూర్(జి)/దస్తురాబాద్: అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాలల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.ఎంఈవో గంగాధర్, హెచ్‌ఎంలు మునీందర్ రాజు, బర్ల చిన్నయ్య, రవీంద్రకుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీమా చెక్కుల అందజేత

భైంసాటౌన్: పట్టణంలోని మిర్జాపూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో సోమవారం పలువురికి బీమా చెక్కులు అందజేశారు. పీఏసీఎస్‌లో స్వల్పకాలిక రుణాలు తీసుకున్న నలుగురు సభ్యులు ఇటీవల మృతిచెందారు. దీంతో వారికి మంజూరైన రూ.2 లక్షల చొప్పున బీమా చెక్కులను అందించినట్లు చైర్మన్ దేవేందర్‌రెడ్డి తెలిపారు. డైరెక్టర్ శ్రీనివాస్, వై.శ్రీనివాస్, చంద్రకాంత్‌రెడ్డి, సొసైటీ సిబ్బంది రాజేందర్, శ్రావణ్, సురేష్ పాల్గొన్నారు.

సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలి

భైంసాటౌన్: పట్టణంలోని ఏడో వార్డు పరిధిలోని రాహుల్‌నగర్, దబ్బాగల్లి, విద్యానగర్, సాయినగర్, భాగ్యనగర్ కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని కాలనీవాసులు కోరారు. ఈ మేరకు సోమవారం సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్‌కుమార్‌ను పట్టణంలోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. సమస్య పరిష్కరించాలని కోరారు. కాలనీవాసులు గాలి రాజన్న, తదితరులున్నారు.

ఆలయాల్లో సంప్రోక్షణ

దస్తురాబాద్: సంపూర్ణ చంద్రగహణం ముగిశాక మండలంలోని రేవోజీపేటలో రామలింగేశ్వర, గోడిసీర్యాల రాజన్న, దస్తురాబాద్‌లోని లక్ష్మీ నరసింహ, శివాలయం, వేంకటేశ్వర ఆలయాల్లో సోమవారం ఉదయం సంప్రోక్షణ చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు.